క్లుప్తంగా

14న హనుమాన్ శోభాయాత్ర

తెనాలి: హనుమత్ జయంతి సందర్భంగా ఈ నెల 14న తెనాలిలో శ్రీ హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నారు. శోభాయాత్ర బ్రోచరు, వాల్ పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించనున్నారు. స్థానిక గంగానమ్మ పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వాహకులు వివరాలను వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు సుల్తానాబాద్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి శ్రీహనుమాన్ శోభాయాత్ర ప్రారంభిస్తామని తెలిపారు. బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయ స్వామి గుడి వరకు కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మద్దాళి శేషాచలం, కొత్తమాసు రామకృష్ణ, వేమా సురేష్‌బాబు, అన్నవరపు వేణు, కొల్లా గురునాథ గుప్త, భాస్కరుని లక్ష్మీనారాయణ, చుండూరు సాయి, ఆదిత్య బోడపాటి పాల్గొన్నారు.

10లోపు పెన్షనర్లు ఈకేవైసీ చేయించాలి

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అందరూ ఈ నెల 10వ తేదీలోగా తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణమూర్తి, బొమ్మదేవర వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీని ఉచితంగానే చేస్తారని, ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు. ఆధార్ లింక్ అయిన సెల్ ఫోన్, సీఎఫ్ఎంఎస్ నంబరును తీసుకెళ్లాలని తెలిపారు. సందేహాలుంటే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: నందివెలుగు గ్రామంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా కంచర్లపాలెం, చింతలపూడి, నందివెలుగు, ఎరుకలపూడి గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వసంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి



తెనాలి: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పెమ్మసాని థియేటర్‌లో శ్రీకృష్ణ పాండవీయం సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. అప్పట్లో ఈ చిత్రంలో నటించిన నటీమణి, ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కార గ్రహీత భారతి విష్ణువర్ధన్ ప్రత్యేకంగా ఈ చిత్ర ప్రదర్శనకు హాజరయ్యారు. థియేటరు ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. శత జయంతి సత్కారాల పండుగలో భాగంగా ప్రముఖ సాంఘిక నాటక కళాకారుడు, గాయకుడు బెల్లంకొండ వెంకట్‌ను కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. శత జయంతి నిర్వాహక సారథుల్లో ఒకరైన సినీ రచయిత సాయిమాధవ్ బుర్రా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సేంద్రియ సర్టిఫికేషన్‌పై అవగాహన

తెనాలి: బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న రిలయబుల్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కొల్లిపరలో సేంద్రియ వ్యవసాయ సర్టిఫికేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గ్రామంలోని శ్రేష్ఠ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీసీ) వద్ద ఉదయం 9.30 గంటలకు సదస్సు జరుగుతుందని ఎఫ్‌పీసీ డైరెక్టర్ వుయ్యూరు సాంబిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సదస్సులో బెంగళూరు సంస్థ ప్రతినిధులతో పాటు ఏపీ సీడ్స్ సర్టిఫికేషన్ అథారిటీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. శ్రేష్ఠ సభ్యులు, రైతులు తప్పనిసరిగా పాల్గొని కోరారు.

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

ఫిరంగిపురం: మండలం కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, ఏకహారతి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రమాదవశాత్తూ రైతు కూలీ మృతి

తెనాలిరూరల్: ప్రమాదవ శాత్తు కూలీ మృతి చెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా చుండూరు మండలం దుండిపాలేనికి చెందిన బుర్రి చిట్టెమ్మ(62) వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ ఉంటుంది. ఆదివారం బాపట్ల జిల్లాలోని ఈపూరులో పనులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మొక్కజొన్న కంకులు కోసే యంత్రంపై కూర్చుని వస్తోంది. తెనాలి మండలం బుర్రిపాలెం వద్దకు వచ్చేసరికి యంత్రంపై నుంచి పడి తీవ్ర గాయాలతో మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఐక్య పోరాటాల ఫలితం మేడే

- మేడే వేడుకల్లో ఎమ్మెల్యే శివకుమార్
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణలు
- వాడ వాడలా రెపరెపలాడిన అరుణ పతాకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణ చెంచుపేటలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ముఠా వర్కర్స్ ఆధ్వర్యంలో మే డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కార్మిక పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. శ్రమశక్తి దోపిడీపై కార్మిక లోకం ఐక్యంగా జరిపిన పోరాట ఫలితమే ప్రపంచ కార్మిక దినోత్సవం అని గుర్తుచేశారు. కార్మికులు వివిధ రకాల ఐక్య పోరాటాలతో తమ హక్కులను కొంత వరకు సాధించుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలతో కార్మిక వర్గానికి మేలు జరుగుతోందని చెప్పారు. ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు, కౌన్సిలరు తాడిబోయిన రామయ్య, బూరెల దుర్గా, కఠారి హరీష్, కాళిదాసు వెంకటేశ్వరరావు మాట్లాడారు.

తెనాలి: ఎర్రజెండా అంటే పేదల కోసం పోరాడే జెండా అని, ఆ జెండా నీడలో ఎందరో కార్మికులు, కర్షకులు పోరాటాలు చేశారని ప్రముఖ సినీ రచయిత సాయిమాధవ్ బుర్రా అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక 16వ వార్డు ముత్యంశెట్టిపాలెంలో జరిగిన మే డేలో సాయిమాధవ్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ తాను స్వతహాగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తనని చెబుతూ, బతికినంతకాలం కమ్యూనిస్టుగానే బతుకుతాననీ, చనిపోయిన తర్వాత కూడా కమ్యూనిస్టుగానే అనిపించుకుంటానని చెప్పారు. సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఏఐవైఎఫ్ జిల్లా నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.గురుబ్రహ్మం, బాలస్వామి, బిల్లా రాజేష్, గంటినపల్లి కోటేశ్వరరావు, మల్లవరపు విక్రమ్, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

తెనాలి: స్థానిక కొత్త పేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మేడేను నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. పెన్షనర్లు మేడే జరుపుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. మేడే పుట్టుక, చరిత్రను గౌరవాధ్యక్షుడు సత్యసాగర్ వివరించారు. ఉపాధ్యక్షులు దైతా వెంకట సోమయ్యశాస్త్రి, మహమ్మద్ అజ్గర్ ఆలీ, సహాధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, వై.చింపయ్య, నందూరి నారాయణరావు మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, కోశాధికారి బెల్లంకొండ హృదయరాజు పర్యవేక్షించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో మేడే

తెనాలి: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, తెనాలి శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద మే డే ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు తూనుగుంట్ల సురేష్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. మచిలీపట్నం డివిజన్ ఉపాధ్యక్షుడు వేదాంతం ఫణీంద్ర మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం కోసం పోరాడి అసువులు బాసిన కార్మికులు నివాళులని చెప్పారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానంపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేస్తోందని చెబుతూ కార్మికులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

తెనాలిటౌన్: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.గురుబ్రహ్మం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీ నగర్‌లో సీఐటీయూ కార్యాలయంలో సోమవారం మేడే వేడుకల్లో పాల్గొని, పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను తీసేశారన్నారు. కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, ఎస్టీయూ నాయకులు కనపర్తి బెనహర్, సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, పాశం వెంకటేష్, బొల్లిముంతకృష్ణ, బుల్లయ్య, శశికిరణ్, ఏఐటీయూసీ నాయకులు సీతారం, రఘుబాబు, శ్రీనివాసరావు, శ్రీకాంత్, మాచర్ల శివయ్య, నాగరాజు, వివిధ శాఖల నాయకులు పాల్గొన్నారు.

● సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణలు జరిగాయి. మార్కెట్ సెంటర్‌లో రాడ్‌బెండింగ్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, పాండురంగపేటలోని ఓవర్ బ్రిడ్జి వద్ద డాల్‌మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు భావన్నారాయణ, షేక్ హుస్సేన్‌వలీ, ఎం.వెంకటేశ్వరావు, జి.వెంకటసుబ్బయ్య, ఎం.రవికుమార్, రాజ్యలక్ష్మి, మరియమ్మ, శ్రీనివాసరావు, ఫకీర్, కె.రాజ, శివలక్ష్మి, పద్మ, సుబ్బారావులు పాల్గొన్నారు.



పతాకావిష్కరణ చేసిన సాయిమాధవ్ బుర్రా



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట పతాకావిష్కరణ



ఏఐటీయూసీ కార్యాలయం వద్ద మేడే వేడుకలు

జనం గుండెల్లో సుస్థిర స్థానమే లక్ష్యం

'గడప గడపకు' ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: జనం గుండెల్లో సుస్థిర స్థానం పొందడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే శివకుమార్ ప్రజలకు చేకూరిన సంక్షేమ లబ్ధి వివరాలను తెలియజేశారు. తొలుత కేంద్రీయ విద్యాలయం సెంటరులో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రజా సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేశారు అన్నబత్తుని. చేనేత మగ్గాలు ఉన్న ఇళ్లకు వెళ్లి మగ్గాలను, నేత వస్త్రాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా చేనేత కార్మికులు కుటుంబాల్లో వెలుగు నిండాయని, తాను స్వయంగా చేనేతల ఇళ్లకు వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. పట్టణానికి సమీపంలోని జగ్గడిగుంటపాలెంలో రూ.15 కోట్ల సంక్షేమ కార్యక్రమాలు అందించినట్లు వివరించారు. ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అంటించడం తమ ప్రాధాన్యత కాదని, ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం పొందడమే తమ లక్ష్యమని చెప్పారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కంభం బాలాజీ, ఎంపీటీసీ కాజా భద్రావతి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వీవర్స్ సొసైటీ అధ్యక్షురాలు దామర్ల విజయరాణి, కొడాలి పద్మ, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు యాతాటి అనిల్, నూర్ ఇస్మాయిల్, దాసరి వీర వసంతరావు, పేరం సంజీవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, తహసీల్దార్ కె.రవిబాబు, ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పసుపులేటి వెంకయ్య, కాళిదాసు వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణం వేగవంతం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



జగనన్న కాలనీలో కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు యుద్ధప్రాతి పదికన జరుగుతున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. నియోజకవర్గంలోని శిరిపురం, నేలపాడు, పెదరావూరు–1, 2 జగనన్న కాలనీలను సోమవారం ఆయన సందర్శించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. అధికారులతో మాట్లాడి, అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉందని, లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు త్వరితగతిన చేస్తున్నట్లు చెప్పారు. ఇదే నెలలో అన్ని ఇళ్ల శ్లాబ్ దశకు తీసుకెళ్లటం, ఇప్పటికే ఆ దశకు చేరుకున్న ఇళ్లను పూర్తిచేసేలా పనులను వేగవంతం చేయమని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆయా కాలనీల్లో విద్యుద్దీకరణ, కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. వీరితో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన...

చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో నాడు–నేడు పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్‌తో కలిసి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న తరగతి గదుల భవనం, నిర్మాణం పూర్తయిన స్కూల్ గేటును చూశారు. 31వ వార్డులో ప్రాముఖ్యత కలిగిన కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో భద్రత కోసం రూ.5 లక్షలతో ప్రధాన గేటును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవన నిర్మాణం కూడా పూర్తికావచ్చిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వార్డు కౌన్సిలరు మానసరెడ్డి, కౌన్సిలరు పేరం సంజీవరెడ్డి, పార్టీ నేతలు బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విలువలు పాటించే సమాజం కోసం 'మానవత'



మాట్లాడుతున్న ఎస్.రామచంద్రారెడ్డి

తెనాలి: సమాజాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కార్యకలాపాలను సాగిస్తున్న తమ సంస్థను విస్తృతం చేసే కృషిలో భాగంగా తెనాలిలో కూడా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. స్థానిక కొత్త పేటలోని దేవీప్రియ ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం మానవత సంస్థ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. సంస్థ కార్యకలాపాలను విశదీకరించారు. శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద, శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, జి.నాగేశ్వరరావు, పావులూరి రమేష్, జానిక రామరాజు, డాక్టర్ ఎ.రామాంజులరెడ్డితో సహా వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గ ప్రమాణస్వీకారం



ఎలక్షన్ అధికారులను సన్మానిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు

బాపట్ల అర్బన్: భావపురి బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం శంకర విద్యాలయ ప్రాంగణంలోని గాయత్రీ మాత సన్నిధిలో సోమవారం జరిగింది. ఎలక్షన్ అధికారులుగా ఓగేటి శ్రీనివాస శర్మ, బుజగేంద్ర మౌళి, అచ్యుతుని చలపతిరావు వ్యవహరించారు. వీరిని ఘనంగా సన్మానించారు. భావపురి బ్రాహ్మణ సమాఖ్య సభ్యులకు అధ్యక్షుడు నిభానపుడి శ్రీహరి ప్రకాష్ అభినందనలు తెలిపారు. సమాఖ్య కార్యక్రమాల గురించి కార్యదర్శి సోమరాజు శ్రీనివాస్ సభ్యులకు వివరించారు. ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి నారాయణ, కొలను మోహన్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ నల్లూరి రాఘవాచార్యులు, కార్యవర్గ సభ్యులు, కోశాధికారి పూసపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ ఆస్తుల పరిరక్షణకు కృషి

- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు
- రూ.1. 56 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడడంతో పాటు ఆస్తులను రక్షించి వచ్చే ఆదాయంతో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చెందిన భూమిలో రూ.1.56 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి శంకుస్థాపన చేశారు. శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. నగర పరిధిలోని రాజీవ్ గృహ కల్ప రోడ్డులోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న స్థలంతో రూ.60 లక్షలతో దుకాణ సముదాయం నిర్మాణం, అక్కడే ఖాళీగా ఉన్న 3.30 సెంట్లలో గ్రావెల్‌తో చదును రూ.36లక్షలతో , రూ.60లక్షలతో చేపట్టిన ప్రహరీ నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహించారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ ఆలయానికి చెందిన భూమికి ఇరువైపులా ఒక వైపు రాజీవ్ గృహకల్ప కాలనీ, మరో వైపు టిడ్కో నివాసాలు, మన్నెం వారి బజారు నుంచి టిప్పర్ల బజార్ వరకు రూ.60లక్షలతో రాజీవ్ గృహ కల్పరోడ్డులో దుకాణ సముదాయం నిర్మించడం జరుగుతుందన్నారు. అదే విధంగా కోట్ల రూపాయల విలువైన స్థలం అన్యాక్రాంతం కాకుండా స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసి గ్రావెల్‌తో చదును చేసి స్థలంలో మామిడి, ఉసిరి చెట్లను పెంచి ఉద్యానవనంలా అభివృద్ధి పరచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆలూరి కొండయ్య చౌదరి, వడ్లమూడి వెంకయ్య చౌదరి, పార్టీ నాయకులు ఎండి ఫిరోజ్, ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు వనమా గీతాదేవి, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తుమ్మపూడి- చిలువూరు రైల్వే గేటు తాత్కాలికంగా మూసివేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి– చిలువూరు రైల్వే గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తెనాలి రైల్వే సెక్షన్ ఇంజనీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి 7వ తేదీ వరకు రైల్వే గేటు, మరియు ట్రాక్ మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నామని చెప్పారు. ఆ రహదారిలో ప్రయాణించేవారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



పసుపు కల్లాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: అకాల వర్షాలకు తడిసిన పంటలకు రైతులకు నష్ట పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామ పరిధిలోని తడిసిన పసుపు కల్లాలను రైతు సంఘం నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ గత డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాలకు వివిధ పంటలతో పాటు పసుపు పంట కూడా దెబ్బతిందని అన్నారు. సరైన ధర లేక పసుపు వేసిన రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారని అన్నారు. అకాల వర్షాలకు తడిసి రంగు మారిందనే నెపంతో వెయ్యి రూపాయలు కోత విధించి, రైతుల వద్ద నుండి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే పసుపు క్వింటా మద్దతు ధర పదివేల రూపాయలకు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, రైతులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ దొంగ అరెస్ట్

తాడేపల్లిరూరల్: ప్రైవేటు హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌ల దొంగతనం కేసులో బాలుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. సీఐ శేషగిరిరావు తెలిపిన వివరాలు.. వడ్డేశ్వరంలో 10వ తరగతి వరకు చదివిన బాలుడు ప్రైవేటు హాస్టల్‌లో పనిచేస్తున్నాడు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులతో స్నేహం చేస్తూ వారు నిద్రపోయే సమయంలో వారి వద్ద ఉన్న ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్నాడు. ద్వారకా తిరుమలకు చెందిన హర్ష స్థానిక యూనివర్సిటీలో చదువుతున్నాడు. గత నెల 29వ తేదీ అతడి ల్యాప్‌టాప్‌తో పాటు అతని స్నేహితుడి ల్యాప్‌టాప్‌కు చోరీకి గురయ్యాయి. 30వ తేదీన తిరుపతికి చెందిన సరిగొప్పల చంద్రశేఖర్ ల్యాప్‌టాప్‌తో పాటు అతని స్నేహితుడి ల్యాప్‌టాప్ కూడా చోరీకి గురయ్యింది. వీరు ఇద్దరూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా వడ్డేశ్వరం వద్ద నాలుగు ల్యాప్‌టాప్‌లు తీసుకుని బాలుడు వస్తుండగా ఆ బాలుడిని ప్రశ్నించామని, పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో తమదైన శైలిలో దర్యాప్తు చేయగా ల్యాప్‌టాప్‌లు చోరీ చేసినట్లు సదరు బాలుడు ఒప్పుకున్నాడని, ఆ బాలుడ్ని అరెస్ట్ చేసి కోర్టు హాజరు పరిచినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

పూర్ణాహుతిలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



తెనాలిటౌన్: కాశీ పట్టణంలో గంగానది పుష్కరాలు సందర్భంగా సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో పూజ్య శ్రీ బాలస్వామిజీ పర్యవేక్షణలో సోమవారం భక్తులకు పుష్కర స్నానం శ్రీ చక్రలతో చేయించారు. 200మంది సువాసినీలతో పూజ జరిపించారు. పుష్కర విశిష్టతను భక్తులకు వివరించారు. పూర్ణాహుతిలో రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు పాల్గొన్నారు. గణపతి పూజ, శివాభిషేకం భక్తులచే బాలస్వామిజీ చేయించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాలిగ్రామ మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, పుప్పాల నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, నాగరాజు, శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



తెనాలిరూరల్: చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు..న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక సత్యనారాయణ లేక్ పార్క్‌లో పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రసంగిస్తూ కార్మికులందరూ తప్పనిసరిగా వారికి ఉన్న చట్టాలను తెలుసుకుని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. అదే విధంగా కార్మికులకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందడం గురించి అవగాహన కలిప్పించారు. మహిళా కార్మికులకు స్త్రీ రక్షణ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీలు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, యర్రంశెట్టి, అనీల్ కుమార్, ఎస్ఐ నాగేశ్వరరావు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎక్స్‌పో



బాపట్ల అర్బన్: బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం వారటెక్ – 2023 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోస్టల్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం నుంచి డాక్టర్ పీఎస్‌వీ వాచస్పతి, వి.నవీన్, ఈసీఈ విభాగం నుంచి సీహెచ్ నాగరాజు, ఈఎస్ అండ్ ఐ విభాగం నుంచి జేవీ లక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు పలు ఆధునిక రోబోటిక్స్, కోడింగ్, సైబర్ సెక్యూరిటీ ప్రాజెక్టు నమూనాలు ప్రదర్శించారు. గెలుపొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్స్, బహుమతులు ప్రదానం చేశారు. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ దేశాభివృద్ధి కోసం పాటుపడాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 30 మందిపై కేసు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల, రూరల్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 30 మందిపై సోమవారం కేసులు నమోదు చేశారు. తాడేపల్లి సీఐ శేషగిరిరావు తెలిపిన వివరాలు.. పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి అతివేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 30 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వారందరినీ కోర్టుకు హాజరిచినట్లు వివరించారు.

